ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు
TAMILNADU

శుక్రవారం 19 జూలై 2024



విహారయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న మేయర్

విద్యార్థులకు విహారయాత్ర

● ప్రారంభించిన మేయర్ ప్రియ

ప్యారీస్, జూలై 18: నగరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 4,5 తరగతులు చదువుకుంటున్న విద్యార్థుల విహారయాత్ర పథకాన్ని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) మేయర్ ప్రియ గురువారం ఉదయం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం రిప్పన్ బిల్డింగ్ ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభించారు. 2024-25 విద్యా సంవత్సరంలో నగరంలోని 208 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 130 మాధ్యమిక పాఠశాలల్లో 4,5 తరగతులు చదువుతున్న 24,700 మంది విద్యార్థులను విద్యా విహార యాత్రకు తీసుకెళ్లేందుకు జీసీసీ నిర్ణయించింది. నగరంలో ప్రసిద్ధిచెందిన గిండి చిల్డ్రన్స్ పార్క్, కొట్టూరుపురం బిర్లా ప్లానిటోరియం, ఎగ్మూర్ మ్యూజియం, వండలూరు జూ పార్క్, ఎగ్మూర్ పోలీసు మ్యూజియం, పెరంబూర్ రైలు మ్యూజియం, స్నేక్ పార్క్, అన్నా సెంటినరీ లైబ్రరీ తదితర ప్రాంతాల సందర్శనకు రూ.47.25 లక్షలను కార్పొరేషన్ కేటాయించింది. ఈ పథకంలో తొలివిడతగా 1,255 మంది విద్యార్థినీ, విద్యార్థులు 24 బస్సుల్లో గురువారం విహార యాత్రకు వెళ్లారు. ఈ విద్యా విహారయాత్రలో పాల్గొనే విద్యార్థులకు టీచర్లు, పర్యాటక ప్రాంతాల్లో ఉన్న నిర్వాహకులు వాటి చరిత్ర, విశేషాలు వివరిస్తున్నారు.

2 వేల కంప్యూటర్ సైన్స్ సీట్లు అదనం

● సివిల్, మెకానికల్ కోర్సుల్లో తగ్గింపు

పెరంబూర్, జూలై 18: రాష్ట్ర ఇంజనీరింగ్ కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించి 2024-25 విద్యా సంవత్సరానికి అదనంగా 2వేల సీట్లు పెంచారు. దీంతో, ఇంజనీరింగ్ కళాశాలల్లో గత ఏడాది 2.1 లక్షలున్న సీట్లు, ఈ ఏడాది 2.3 లక్షలకు చేరాయి. దీంతో అదనంగా విద్యార్థులు సీట్లు పొందే అవకాశముంది. అదే సమయంలో, సివిల్, మెకానికల్ తదితర కోర్సుల్లో ఈ ఏడాది 3,000 సీట్లు తగ్గించారు. గత పదేళ్లుగా ఒక కళాశాలలోని కోర్సులో అధికంగా 240 మంది విద్యార్థులు మాత్రమే చేర్చుకోవాలని ఏఐసీటీఈ నిబంధన విధించింది. ఈ నేపథ్యంలో, రానున్న విద్యా సంవత్సరం నుంచి ఈ నిబంధనను ఏఐసీటీఈ తొలగించడంతో, విద్యార్థులు అధికంగా చేరే కోర్సుల్లో సీట్ల సంఖ్య ఆయా కళాశాలలు పెంచుతున్నాయి. కంప్యూటర్ సైన్స్‌లో మాత్రమే ఈ ఏడాది 22,248 సీట్లు అదనంగా చేర్చడంతో మొత్తం సీట్లు 1,19,229కి పెరిగాయి. ఎలాక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ తదితర కోర్సుల్లో సీట్ల సంఖ్య పెంచారు. ఈ కోర్సుల్లో మాత్రమే కొత్తగా 1,147 సీట్లు పెంచడంతో మొత్తం సీట్ల సంఖ్య 53,940కి పెరిగింది. సివిల్, మెకానికల్ తదితర కోర్సుల్లో 2,965 సీట్లు, ఆర్కిటెక్ కోర్సులో 390 సీట్లు తగ్గించడంతో ఈ ఏడాది 57,467, 1,730 సీట్లు మాత్రమే ఉన్నాయి. ఇక, ఈ విద్యా సంవత్సరంలో మాత్రమే అన్నా విశ్వవిద్యాలయ అంగీకారం కోసం 476 ఇంజనీరింగ్ కళాశాలలు దరఖాస్తు చేయగా, ప్రస్తుతం ఆయా కళాశాలల్లో భవన వసతి, మౌలిక వసతులు తదితరాలు పరిశీలిస్తున్నారు. ఈ ఏడాది నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్, ఎలక్ట్రికల్స్ అండ్ కంప్యూటర్, డిజైనింగ్‌లో యూజీ కోర్సులు ప్రారంభించేందుకు కళాశాలలకు అన్నా వర్శిటీ అనుమతులు జారీచేసింది.



ఊటీలో విరిగిపడిన మట్టిచెరియలు

నీలగిరికి రెడ్ అలర్ట్

● ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు

● పలు ప్రాంతాల్లో విరిగిపడిన మట్టిచెరియలు

ప్యారీస్, జూలై 18: వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా నీలగిరి జిల్లాలో శుక్రవారం అతిభారీ వర్షం కురిసే అవకాశముందని ప్రకటించిన చెన్నై వాతావరణ కేంద్రం గురువారం రెడ్ అలర్ట్ జారీచేసింది. వాతావరణంలో మార్పులతో తిరుప్పూర్, తేని, దిండుగల్, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో ఒకటి, రెండు జిల్లాలు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో ఈ నెల 24వ తేది వరకు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని, రాజధాని నగరంలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటుందని, గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలు నమోదవుతుందని తెలిపింది. దక్షిణ కోస్తా ప్రాంతాల్లో ఈ నెల 22 వరకు గంటకు 65 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, అందువల్ల జాలర్లు అప్పటివరకు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని వాతావరణ కేంద్రం సూచించింది.

పాఠశాలలకు సెలవు ...

నీలగిరి జిల్లాలో ఈశాన్య రుతుపవనాలు వేగవంతం కావడంతో కొద్ది రోజులుగా జిల్లావ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని ఊటీ, కుంద, గూడలూరు, పందలూరు పంచాయతీల్లోని పాఠశాలలకు గురువారం కలెక్టర్ లక్ష్మీ భవ్య సెలవు ప్రకటించారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో మట్టిచెరియలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గూడలూరు ప్రాంతంలో వర్షాలకు తోరపల్లి, పడందరై ప్రాంతాల్లోని చెరువుల్లో వరద ప్రవాహం పెరిగింది. జనవాసంలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు వర్షార్పణమయ్యాయి. తెప్పకాడు ప్రాంతంలోని కల్వర్టు నీటమునగడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిషేధించారు. అందువల్ల మసినగుడి పంచాయతీ పరిధిలో ఉన్న 10కి పైగా గ్రామాలకు బస్సు సర్వీసులు నిలిపివేశారు. ఇరువయల్ గ్రామాన్ని వరద నీరు ముంచెత్తడంతో అక్కడున్న 13 కుటుంబాల వారిని రక్షించి తోరపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణానికి తరలించారు. మట్టిచెరియలు విరిగిపడిన కారణంగా పలు గ్రామాల్లో ఇంటి గోడలు బీటలు బారాయి.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో

లాయర్లు, రౌడీలకు సంబంధం?

బీజేపీ మహిళా నాయకురాలి కోసం గాలింపు ● జాబితా సిద్ధం చేసి ముమ్మర దర్యాప్తు

చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసుతో మరో ఏడుగురు న్యాయవాదులు, పేరుమోసిన ముగ్గురు రౌడీలకు సంబంధాలున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ దిశగా ప్రత్యేక పోలీసు దళాలతో వీరి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు ప్రారంభించారు. అదే సమయంలో ఈ హత్యలో కీలకపాత్ర పోషించిన ప్రస్తుతం పరారీలో ఉన్న పుళియంతోపు ప్రాంతానికి చెందిన బీజేపీ మహిళా నాయకురాలి ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ హత్య జరిగిన ఐదో తేదీ అర్ధరాత్రి గతేడాది హత్యకు గురైన రౌడీ ఆర్కాడ్ సురేష్ తమ్ముడు పొన్నై బాలు. రాము, తిరువేంగడం, తిరుమలై, బీజేపీ కార్యకర్త సెల్వరాజ్, మణివన్నన్, సంతోష్, అరుళ్, గోకుల్, విజయ్, శివశక్తి అనే 11 మందిని అరెస్టు చేశారు. వీరిలో తిరువేంగడం అనే రౌడీ మాధవరం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. మిగిలిన పదిమందిలో డీఎంకేకు చెందిన న్యాయవాది అరుళ్ (33) పొన్నై బాలు బావమరిది ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు పథకం రూపొందించినట్లు పోలీసులు కనుగొన్నారు. అరుళ్ సెల్‌ఫోన్‌లో నమోదైన వివరాల ప్రకారం జామ్‌బజార్ ప్రాంతానికి చెందిన అన్నాడీఎంకే మహిళా నేత మలర్‌కొడితో సంబంధాలున్నాయని, హత్యకు పాల్పడినవారికి డబ్బులు పంచే లావాదేవీలపై ఆమెతో చర్చలు జరిపారని బహిర్గతమైంది. మలర్‌కొడి, ఆమె సహాయకుడు ఓల్డ్ వాషర్‌మెన్‌పేటకు చెందిన లాయర్ హరిహరన్ (27)కు కూడా ఈ హత్యతో సంబంధం ఉన్నట్లు తెలిసింది. బుధవారం రాత్రి వీరితో పాటు తిరునింద్రవూరుకు చెందిన సతీష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఈ హత్యకేసులో ఎన్‌కౌంటర్‌లో హతమైన తిరువేంగడం మినహా అరెస్టయినవారి సంఖ్య 13కు పెరిగింది. వీరందరిని పోలీసులు విచారించగా వేలూరు జైలులో ఉన్న పేరుమోసిన రౌడీ మలర్‌కొడికి ఆమ్‌స్ట్రాంగ్‌ను హతమార్చేందుకు భారీగా నగదు ఇచ్చినట్లు తెలుసుకున్నారు. ప్రస్తుతం వేలూరు జైలులో ఉన్న రౌడీని కస్టడీకి తీసుకుని విచారణ జరిపేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా ఈ హత్యకేసుతో తిరునింద్రవూరుకు చెందిన సతీష్ అనే యువకుడికి సంబంధాలున్నట్లు తెలియడంతో అతడిని నిర్బంధించి పోలీసులు విచారణ జరుపుతున్నారు. అరెస్టయిన అరుళ్‌తో సతీష్‌కు సన్నిహిత సంబంధాలున్నాయని కనుగొన్నారు. ఈ పరిస్థితులలో ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసుతో ఏడుగురు న్యాయవాదులకు, ముగ్గురు రౌడీలకు కూడా సంబంధాలున్నాయని తెలియడంతో వారి వివరాలను సేకరించారు. త్వరలో వీరి ఆచూకీ కోసం పోలీసులు తీవ్ర గాలింపుచర్యలు చేపట్టనున్నారు.



మలర్‌కొడి, హరిహరన్, సతీష్, పరారీలో ఉన్న బీజేపీ మహిళా నేత అంజలై

బీజేపీ మహిళానేతకు సంబంధం...

ఇదిలా ఉండగా ఈ హత్య కేసులో ఉత్తర చెన్నై ప్రాంతానికి చెందిన బీజేపీ మహిళా విభాగం నాయకురాలు అంజలై ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. అంజలై గతేడాది హత్యకు గురైన ఆర్కాడ్ సురేష్ స్నేహితురాలని పోలీసులు తెలిపారు. ఆమెను అరెస్టు చేస్తే మరిన్ని వాస్తవాలు వెల్లడవుతాయని చెప్పారు.

పార్టీల నుంచి బహిష్కరణ...

ఈ హత్యకేసులో తాజాగా అరెస్టయిన న్యాయవాదులు హరిహరన్ తమిళ మానిల కాంగ్రెస్ స్థానిక నాయకుడిగాను, అదే విధంగా మహిళా న్యాయవాది మలర్‌కొడి అన్నాడీఎంకే స్థానిక నాయకురాలిగా వ్యవహరిస్తున్నారు. వీరిని పార్టీ నుండి తొలగించినట్లు టీఎంసీ నేత జీకే వాసన్, అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి వేర్వేరు ప్రకటించారు. ఇక ఇప్పటివరకూ జరిపిన దర్యాప్తులో ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసుకు సంబంధించి వ్యాసార్పాడికి చెందిన రౌడీ ముఠాకు సంబంధం ఉన్నట్లు నిర్ధారణ అయిందని పోలీసు అధికారులు తెలిపారు.



చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన నీటి సరఫరా, పారిశ్రామిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధి, మహిళాభ్యుదయం, రహదారుల అభివృద్ధి సహా కీలకమైన 13 రంగాల్లో రాష్ట్రం పురోగమిస్తోందంటూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నీతి ఆయోగ్ ప్రకటించింది. గత మూడేళ్లుగా వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి, పథకాల అమలు తదితర అంశాలపై పరిశీలించి సమగ్రమైన నివేదిక రూపొందించింది. అందులో 13 రంగాల్లో అన్ని రాష్ట్రాల కంటే తమిళనాడు రాష్ట్రం ముందంజలో ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం 92 శాతం పేదరికాన్ని నిర్మూలించినట్లు ఆ నివేదికలో తెలిపారు. నాణ్యమైన విద్యనందించటంలో జాతీయ స్థాయిలో సగటున 61 పాయింట్లు పొందిందని, ఇదే విధంగా సురక్షితమైన తాగునీటి సరఫరా, ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక సదుపాయాల కల్పన తదితర రంగాల్లోనూ జాతీయ స్థాయిలో రాష్ట్రం అగ్రగామిగా ఉంటోందని నీతి ఆయోగ్ కితాబిచ్చింది. పేదరిక నిర్మూలనలో కేంద్ర పాలిత రాష్ట్రాలు సహా అన్ని రాష్ట్రాల కంటే రాష్ట్రం ప్రథమ స్థానం సంపాదించుకుంది. ఇదే విధంగా గ్రామీణ ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేయడంలోనూ అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉంది. రాష్ట్రంలో ప్రతికుటుంబంలోనూ సెల్‌ఫోన్ వినియోగం ఉందని, రాష్ట్ర వ్యాప్తంగా 92.8 శాతం మంది సెల్‌ఫోన్లు ఉపయోగిస్తున్నారన్నారు. ఆధార్‌కార్డుల అనుసంధానంలోనూ రాష్ట్రం ముందంజలోనే ఉంది.

పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య సహా

13 రంగాల్లో రాష్ట్రం ముందంజ

● నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి

ఆ ఎన్నిక ఫలితం తప్పిదం

● కోర్టుకెక్కిన ఓపీఎస్

● అదే బాటలో విజయప్రభాకర్, నయినార్ నాగేంద్రన్

పెరంబూర్, జూలై 18: రామనాథపురం నియోజకవర్గంలో పోటీచేసిన నవాజ్‌ఘనీ, ఆస్తుల వివరాలు సక్రమంగా వెల్లడించకపోవడంతో, ఆయన గెలుపు చెల్లదని ప్రకటించాలని కోరుతూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన ఓ.పన్నీర్‌సెల్వం మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. అలాగే, విరుదు నగర్ నియోజకవర్గంలో పోటీచేసిన డీఎండీకే అభ్యర్థి విజయప్రభాకర్, తిరునల్వేలి నియోజకవర్గంలో పోటీచేసిన బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్ కూడా వేర్వేరుగా పిటిషన్లు దాఖలుచేశారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేది విడుదల కాగా, రాష్ట్రంలోని 39 నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి విజయం సాధించింది. విజయంపై ఆక్షేపణలుంటే తెలియజేయాలని, ఎన్నికల ఫలితాలు విడుదలైన 45 రోజుల్లోగా పిటిషన్ వేసుకోవచ్చనే ఎన్నికల నిబంధనలో ఉంది. ఆ ప్రకారం, గురువారం రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం, డీఎంకే కూటమి అభ్యర్థి నవాజ్‌ఘనీ విజయన్ని వ్యతిరేకిస్తూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. రామనాథపురం నియోజకవర్గం నుంచి విజయం సాధించిన నవాజ్‌ఘనీ, నామినేషన్ పత్రంలో ఆస్తుల వివరాలు సక్రమంగా చూపలేదని, అందువల్ల ఆయన గెలుపు చెల్లదని ప్రకటించాలని పిటిషన్‌లో ఓపీఎస్ అభ్యర్థించారు. అలాగే, తిరునల్వేలి నియోజకవర్గ ఎన్నిక ఫలితాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్ పిటిషన్ వేశారు. విరుదునగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి మాణిక్యం ఠాగూర్ విజయాన్ని వ్యతిరేకిస్తూ డీఎండీకే అభ్యర్థి విజయ ప్రభాకరన్ కూడా పిటిషన్ దాఖలుచేశారు.



శశికళను పార్టీలో చేర్చుకొనే ప్రసక్తే లేదు

● అన్నాడీఎంకే సభాపక్ష ఉపనేత ఆర్బీ ఉదయకుమార్

ప్యారీస్, జూలై 18: శశికళను పార్టీలో చేర్చుకొనే ప్రసక్తే లేదని, ఆమె రాజకీయాల నుంచి తప్పుకుంటేనే మంచిదని అన్నాడీఎంకే శాసనసభ పక్ష ఉపనేత, మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ తేల్చిచెప్పారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాలిగైలో గురువారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ... అమ్మా వళియిల్ పయనం అనే పేరుతో శశికళ దక్షిణ జిల్లాల్లో పర్యటిస్తున్నారని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి జానకి అమ్మాళ్ లాగే శశికళ కూడా రాజకీయాల నుంచి తప్పుకుంటే బాగుంటుందని, అన్నాడీఎంకేలో ఆమెకు స్థానంలేదన్నారు. మహాత్మా గాంధీ అహింసా మార్గంలోనే బ్రిటీషు పాలకుల నుంచి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారని, అందువల్ల 75 ఏళ్లుగా ప్రజలంతా స్వేచ్ఛగా ఉన్నారని అయితే, రాజకీయాలు మారుతున్న కారణంగా ప్రజలకు ప్రస్తుతం స్వేచ్ఛ కరువైందన్నారు. 1972లో అవినీతికి వ్యతిరేకంగా అన్నాడీఎంకేను స్థాపించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ తన జీవితాన్ని బడుగు, బలహీనవర్గాలకు అంకితం చేశారన్నారు. పార్టీలో సాధరణ కార్యకర్తగా వ్యవహరించిన ఎడప్పాడి పళనిస్వామి అంచెలంచెలుగా ఎదిగి పార్టీ ప్రధాన కార్యదర్శిగా ముఖ్యమంత్రి కాగలిగారన్నారు. పార్టీలో ప్రస్తుతం 2 కోట్ల మందికి పైగా సభ్యులున్నారని, కులమత బాషా బేధాలు లేకుండా ఈపీఎస్ అందర్నీ సమానంగా చూస్తున్నారని, పార్టీకి వెన్నుపోటు పొడిచిన శశికళ, పన్నీర్‌సెల్వం, టీటీవీ దినకరన్ వంటి నేతలకు అన్నాడీఎంకేలో చోటులేదని ఉదయకుమార్ తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉదయకుమార్

ఏడో రోజు ఈపీఎస్ మంతనాలు...

పార్లమెంటు ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓటమికి గల కారణాలను లోక్‌సభ నియోజకవర్గాల పార్టీ నిర్వాహకులతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నిర్వహిస్తున్న సమావేశాలు గురువారం ఏడో రోజున కొనసాగాయి. రాయపేటలోని పార్టీ కార్యాలయంలో కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చి, నీలగిరి నియోజకవర్గాల పార్టీ నిర్వాహకులు పాల్గొని, ఆ ప్రాంతాల్లో పార్టీ పరంగా నెలకొన్న సమస్యలు ఈపీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని మెజార్టీ సీట్లతో గెలిపించి అధికారం చేపట్టేలా ప్రతి ఒక్కరూ ఇప్పటినుంచే సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఇదిలా ఉండగా, ఈ నెల 10వ తేది నుంచి ప్రారంభమైన అభిప్రాయ సేకరణ సమావేశం శుక్రవారంతో ముగియనుంది. ఈ చివరి సమావేశంలో విల్లుపురం, కన్నియాకుమారి, ధర్మపురి పార్లమెంటు నియోజకవర్గాల పార్టీ నిర్వాహకులతో ఈపీఎస్ సమావేశం కానున్నారు.

సమాచార దర్శిని

రేపు ఆధ్యాత్మికోపన్యాసాలు

ఐసిఎఫ్, జూలై 18: కశ్మీర్ ప్రత్యేకతపై ఆధ్యాత్మిక ఉపన్యాసాలు శనివారం జరుగనున్నాయి. కంచి మఠం ఆధ్వర్యంలో 14 రోజులకు ఒకసారి జరిగే ప్రత్యేక ఉపన్యాసాలు మాధ్యమ ధర్మ సమాజం యూ ట్యూబ్ ఛానల్‌లో ప్రసారమవుతోంది. ఆ ప్రకారం, ఈ శనివారం రాత్రి 7 గంటలకు 'కశ్మీర్ శైవంలో ఆధ్యాత్మికం, వైజ్ఞానిక సదస్సు' అనే పేరుతో 100వ కార్యక్రమం జరుగనుండగా, హరియాణా విశ్వకర్మ నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయ ఉపకులపతి రాజ్ నెహ్రూ ఉపన్యసించనున్నారు. ఈ కార్యక్రమం నేరుగా చూడలేని వారు కంచి కామకోటి ఫేస్‌బుక్, కామకోటి టీవీ, యూ ట్యూబ్, ఎక్స్ వంటి ద్వారా వీక్షించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

నేడు ఉత్తనాచ్చి అమ్మన్ ఆడి ఉత్సవాలు

ఐసిఎఫ్, జూలై 18: స్థానిక అరుంబాక్కం-పూంద మల్లి రోడ్డులో ఉన్న ఉత్తనాచ్చి అమ్మన్ ఆలయ ఆడి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. 800 ఏళ్లనాటి ప్రాచీన గ్రామదేవత పిడారి ఉత్తనాచ్చి అమ్మన్ ఆలయంలో ప్రతి సంవత్సరం ఆడి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. 54వ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానుండగా, 21వ తేది ఉదయం ప్రత్యేక అర్చన, మధ్యాహ్నం 12 గంటలకు అంబళి ప్రసాద పంపిణి, రాత్రి 7 గంటలకు పూర్ణ కుంభం నిర్వహించనున్నారు.

నేడు రాత్రి 11.59 వరకు గ్రూప్-2 దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, జూలై 18: టీఎన్‌పీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్ష దరఖాస్తుల స్వీకరణకు శుక్రవారం చివరిరోజు. రాష్ట్రప్రభుత్వ వివిధ శాఖల్లోని గ్రూప్-2 విభాగంలో 507 పోస్టులు, గ్రూప్-2ఏ విభాగంలో 820 పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రిలిమినరీ పరీక్ష సెప్టెంబరు 14వ తేది జరుగనుంది. ఈ పరీక్షకు దరఖాస్తుల సమర్పణ శుక్రవారంతో ముగియనుంది. ఆ ప్రకారం, శుక్రవారం రాత్రి 11.59 గంటల వరకు దరఖాస్తులు సమర్పించ వచ్చని టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

కందిపుప్పు, పామాయిల్ కొనుగోలుకు టెండర్లు

పెరంబూర్, జూలై 18: ప్రజా పంపిణీ పథకంలో కందిపప్పు, పామాయిల్ కొనుగోలుకు రాష్ట్రప్రభుత్వం టెండర్లు విడుదల చేసింది. రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న కందిపప్పు, పామాయిల్ తదితరాలు నిర్ణీత కాలంలో వినియోగదారులకు అందించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అవసరమైన 4 కోట్ల ప్యాకెట్ల పామాయిల్, 40,000 మెట్రిక్ టన్నుల కందిపప్పు కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు.

24న కావేరి నిర్వహణ మండలి సమావేశం

పెరంబూర్, జూలై 18: కావేరి నిర్వహణ మండలి సమావేశం ఈనెల 24వ తేది ఢిల్లీలో జరుగనుంది. మండలి అధ్యక్షుడు ఎస్కే హల్దర్ నేతృత్వంలో మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే సమావేశంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అధికారులు పాల్గొనాలని వర్తమానం అందినట్టు రాష్ట్ర ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో కర్ణాటక విడుదల చేయాల్సిన కావేరి జలాలపై రాష్ట్ర అధికారులు కోరనున్నట్లు వారుపేర్కొన్నారు.

47,464 మందికి ఉపాధి పథకం గుర్తింపు కార్డులు

ఐసిఎఫ్, జూలై 18: నగర ప్రాంత ఉపాధి పథకంలో 47,464 మందికి గుర్తింపు కార్డులు అందజేయనున్నట్లు చెన్నై కార్పొరేషన్ అధికారులు తెలిపారు. ఈ పథకం కింద ఆర్థికంగా వెనుకబడిన ప్రజలు కలిగిన తండయార్‌పేట, తిరువికనగర్ మండలాలు ఎంపిక చేశారు. వీటిలో 3 లక్షల కుటుంబాల్లో ఆర్థికంగా వెనుబడిన వారి జాబితా తయారుచేసి, 47,464 మందిని ఎంపిక చేసి గుర్తింపు కార్డులు అందజేయనున్నారు.

మూడు జలాశయాల్లో పూడికతీత

ఐసిఎఫ్, జూలై 18: నగరంలోని మూడు జలాశయాల్లో పూడికతీత పనులు త్వరలో చేపట్టనున్నట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు. చెన్నై, శివారు ప్రాంతాల్లో 10 జలాశయాలను అభివృద్ధికి రూ.100 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. వాటిలో పెరుంబాక్కం జలాశయాన్ని రూ.19 కోట్లు, రెట్టేరి జలాశయాన్ని రూ.10.75 కోట్లు, కొళత్తూర్ జలాశయాన్ని రూ.5 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. త్వరలో పూడికతీత పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

పూర్తయిన పట్టాభిరాం ఫ్లై ఓవర్

ఐసిఎఫ్, జూలై 18: స్థానిక పట్టాభిరాం రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణాలు పూర్తికావడంతో త్వరలో ప్రజల అందుబాటులోకి రానుంది. పట్టాభిరాం రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే గేట్ మూసివేసి 2010లో రూ.33 కోట్లతో నాలుగు మార్గాల ఫై ఓవర్ నిర్మాణం ప్రారంభించారు. అనంతరం ఈ ఫ్లై ఓవర్‌ను సిక్స్ వేగా మార్చి నిధులు పెంచారు. రెండేళ్లలో పూర్తికావాల్సిన ఈ ఫ్లై ఓవర్ పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. ఎట్టకేలకు నిర్మాణపనులు పూర్తయ్యాయి.

రేపు రేషన్ దుకాణాలకు సెలవు

పెరంబూర్, జూలై 18:! రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాలకు శనివారం సెలవు ప్రకటించారు. మహిళా సాధికారిక పరిశీలనకు రేషన్ ఉద్యోగులు పనిచేశారు. సెలవు రోజుల్లో పనిచేసినందుకు మరో రోజు సెలవు ఇస్తామని సంబంధిత శాఖాధికారులు ప్రకటించారు. రెండు రోజుల పనిదినాలు భర్తీచేసేలా గత నెల 15వ తేది ఒక రోజు సెలవు ప్రకటించగా, ఈ నెలలో శుక్రవారం రేషన్ ఉద్యోగులకు సెలవు ప్రకటిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

నేడు విద్యుత్ ఛార్జీల పెంపుపై పీఎంకే ధర్నా

ప్యారీస్, జూలై 18: రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపును ఖండిస్తూ ఈ నెల 19న పీఎంకే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వ్యవస్థాపకుడు డా.రాందాస్ ప్రకటించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి నేతృత్వంలో నగరంలో ధర్నా జరుగుతుందని ఆయన తెలిపారు.

నేటినుంచి కోవైలో బుక్ ఎగ్జిబిషన్

పెరంబూర్, జూలై 18: కోయంబత్తూర్‌లోని కొడీసియా మైదానంలో ఈనెల 19నుంచి 28వ తేది వరకు బుక్ ఎగ్జిబిషన్ జరుగనుంది. ఈ ఎగ్జిబిషన్‌లో తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, ఆంధ్ర, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, అస్సాం, చత్తీస్‌ఘడ్, న్యూ ఢిల్లీకి చెందిన పుస్తక ప్రచురణ సంస్థలు సుమారు 280 స్టాల్స్ ఏర్పాటుచేయనున్నాయి.ఉదయం 11నుంచి రాత్రి 8గంటల వరకు ఈ ఎగ్జిబిషన్‌లో ప్రజలు పాల్గొనవచ్చు. గత ఏడాది నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో రూ.2 కోట్ల విలువైన పుస్తకాలు విక్రయమయ్యాయి. ఈ ఏడాది బుక్ ఎగ్జిబిషన్‌లో 'బుక్ డొనేషన్ డ్రైవ్' చేపట్టారు. ఈ సందర్భంగా గ్రంథాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు ఎవరైనా పుస్తకాలు విరాళంగా అందించవచ్చని జిల్లా యంత్రాంగం తెలియజేసింది.

ఘనంగా పీఎంకే ఆవిర్భావ దినోత్సవం

పెరంబూర్, జూలై 18: పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) 36వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. మేడవాక్కం మెయిన్ రోడ్డులోని పోలీస్‌స్టేషన్ సమీపంలో నిర్వహించిన వేడుకలకు చెంగల్పట్టు నార్త్ జిల్లా కార్యదర్శి లయన్ జి.పచ్చయప్పన్ అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి షోలింగనల్లూర్ ఎస్ఎం నిర్మల్ కుమార్ ఆహ్వానించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ అధ్యక్షుడు డా.అన్బుమణి రాందాస్ పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు మొక్కలు, ప్రభుత్వ పాఠశాలలకు ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో పసుపు తాయగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కన్నన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామ్‌కుమార్, శేఖర్, జిల్లా వన్నియర్ సంఘ కార్యదర్శి ముత్తుకుమార్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.అన్బుమణి మాట్లాడుతూ, పార్టీ 36వ ఆవిర్భావ దినోత్సవం రాష్ట్రంతో పాటు ఆంధ్ర, కేరళ, పుదుచ్చేరి, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో కూడా పార్టీ నేతలు పార్టీ పతాకాలు ఎగురవేస్తున్నారన్నారు. రాష్ట్రంతో పాటు దేశాభివృద్ధికి పార్టీ తోడ్పడుతుందన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి

ఒంటరిగా పోటీచేసినా విజయం ప్రకాశంగా ఉంటుంది

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై

పెరంబూర్, జూలై 18: ఒంటరిగా పోటీచేసినా, గెలుపు ప్రకాశవంతంగా ఉంటుందని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వ పెరుందగై వ్యాఖ్యానించారు. తిరువళ్లూర్ నగర కాంగ్రెస్ నిర్వాహకుల సమావేశంలో సెల్వ పెరుందగై మాట్లాడుతూ... ఐదేళ్ల క్రితం ఉన్న విధంగా కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం లేదన్నారు. అన్ని స్థానాల్లో బలంగా ఉందన్నారు. ఒంటరిగా పోటీచేసినా విజయం సాధించేలా పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని కోరారు. 2021 శాసనసభ ఎన్నికల్లోను, 2024 పార్లమెంటు ఎన్నికల్లోనూ మనకు తగిన గుర్తింపు, మర్యాద ఇవ్వలేదని, ఏదో ఒక విధంగా ఉదాసీనతగా వ్యవహరించారన్నారు. మనం బలంగా ఉంటే మర్యాద, గౌరవం లభిస్తాయని తెలిపారు. అనంతరం సెల్వపెరుందగై మీడియాతో మాట్లాడుతూ... పార్టీని బలోపేతం చేయాలని తాను సమావేశంలో సూచించానని తెలిపారు. ప్రస్తుతం 9 స్థానాలు కోరామని, ఓటు బ్యాంక్ అధికమైతే 20 స్థానాలు కోరే స్థాయికి నేతలు, కార్యకర్తలు ఐకమత్యంతో పార్టీని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చామని తెలిపారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపేలా ప్రసంగించడంలో తప్పు లేదన్నారు. సిద్ధాంతాలు, లక్ష్యాలు ఉన్న పార్టీ కాంగ్రెస్ అని, బీజేపీలో అలాంటివి లేవని సెల్వపెరుందగై అభిప్రాయపడ్డారు.



టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

6.5 లక్షల మంది ఉచిత ఇళ్ల పట్టాలు

ఐసిఎఫ్, జూలై 18: డీఎంకే అధికారం చేపట్టిన మూడేళ్లలో 6.5 లక్షల మందికి ఉచిత ఇళ్ల స్థల పట్టాలు అందజేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వ రెవెన్యూ శాఖ ప్రజలకు అవసరమయ్యే సర్టిఫికెట్లు అందజేయడం, పించన్ పంపిణీ, సాంఘిక సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కార శిబిరాలు నిర్వహించడం వంటివి చేపడుతుంటుంది. ఇవి మినహా స్థల యజమానులకు పట్టాలు అందజేయడం జరుగుతోంది. ఆ ప్రకారం, మూడేళ్లలో 6,52,559 మందికి ఉచిత ఇళ్ల స్థల పట్టాలు అందజేసింది.

అభివృద్ధి పనుల పరిశీలన

వేలూరు, జూలై 18: స్థానిక అడుక్కమ్‌పారై పంచాయతీ ఇడయమ్ పట్టిలో ఓటేరి కాలువ మధ్య రూ.34.99 లక్షలతో మహాత్మాగాంధీ దేశీయ రూరల్ అభివృద్ధి పథకం కింద నిర్మిస్తున్న నేల వంతెనను గురువారం కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. అనంతరం ఇడయమ్‌పట్టి మాంతోపు పంచాయతి యూనియన్ పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, బోధనా విధానం, మధ్యాహ్న భోజనం, అల్పాహారం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట కనియంబాడి పంచాయతీ యూనియన్ కమిటీ అధ్యక్షుడు దివ్య కమల్‌ప్రసాద్, పంచాయతీల అసిస్టెంట్ డైరెక్టర్ ఉమ, ఇంజనీర్ శ్రీనివాసన్, తహసీల్దార్ మురళీధరన్, అడుక్కమ్‌పారై పంచాయతి యూనియన్ అధ్యక్షుడు తిరునావుక్కరసు తదితరులున్నారు.



నేల వంతెన నిర్మాణాలు పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

ఆవిన్ వెన్న విక్రయాలు ప్రారంభం

ఐసిఎఫ్, జూలై 18: దుకాణాల్లో ఆవిన్ వెన్న విక్రయాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఆవిన్‌లో పాల కొనుగోలు పెరిగిన నేపథ్యంలో, పలు నెలల అనంతరం వెన్న ఉత్పత్తి ప్రారంభించారు. 2023లో పాల కొనుగోళ్లు 41 లక్షల లీటర్ల నుంచి 26 లక్షల లీటర్లకు తగ్గింది. దీంతో, ఆ ఏడాది దీపావళికి ముందు వెన్న ఉత్పత్తి నిలిపివేశారు. అయితే ప్రైవేటు సంస్థలు పాల కొనుగోలు ధర తగ్గించడంతో ఉత్పత్తిదారులు మళ్లీ ఆవిన్ వైపు తిరిగారు. దీంతో, కొనుగోళ్లు 36 లక్షల లీటర్లకు పెరిగింది. వెన్న ఉత్పత్తి కూడా ప్రారంభమైంది. ఉప్పు కలిపిన, ఉప్పు కలపని వెన్న 100 గ్రాములు, 500 గ్రాముల ప్యాకెట్లు అందుబాటులోకి వచ్చాయి.

కుట్రాలంలో పర్యాటకులకు అనుమతి

ఐసిఎఫ్, జూలై 18: వరదలు తగ్గడంతో కుట్రాలంలో స్నానాలకు పర్యాటకులను అధికారులు అనుమతించారు. తెన్‌కాశి జిల్లా పశ్చిమ కనుమల ప్రాంతాల్లో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రధాన జలపాతం, ఐందరువి, పాత కుట్రాలం, పులిఅరువి, చిత్రరవి జలపాతాల్లో వరదలు ఏర్పడ్డాయి. పర్యాటకుల భద్రత దృష్ట్యా స్నానాలకు నిషేధం విధించారు. ఐందరువిలో వరదలు తగ్గుముఖం పట్టడంతో పర్యాటకులకు అనుమతి కల్పించారు. దీంతో, గురువారం జలపాతం వద్ద పర్యాటకుల సంఖ్య పెరిగింది.

వాణిజ్య, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం రూ.5,920 కోట్లు

పెరంబూర్, జూలై 18: రాష్ట్ర వాణిజ్య, రిజిస్ట్రేషన్ శాఖకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు రూ.5,290 కోట్లు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. గత ఏడాదితో పోల్చితే ఆదాయం రూ.821 కోట్లు పెరిగిందని తెలిపారు. రిజిస్ట్రేషన్‌లో అవినీతిని అరికట్టేలా పలు చర్యలు చేపట్టామన్నారు. అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు చేపట్టామన్నారు. అలాగే, నకిలీ, అనుమతి లేని పత్రాలతో జరిగిన రిజిస్ట్రేషన్ల పరిశీలన జరుగుతోందని, అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని ఆ శాఖ అధికారులు హెచ్చరించారు.

భవన నిర్మాణ వస్తువుల ధరల జాబితా విడుదల

ఐసిఎఫ్, జూలై 18: ప్రభుత్వ శాఖల భవన నిర్మాణాలకు సంబంధించి వస్తువుల జాబితాను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. ఈ జాబితాలో మార్కెట్ ధర కన్నా 60 నుంచి 80 శాతానికి సమానంగా ధరలు నిర్ణయించారు. దీంతో, నిర్మాణపనులు చేపట్టే ఒప్పందదారులకు భారం తగ్గనుంది. మార్కెట్లో 50 కిలోల సిమెంట్ బస్తా రూ.365 ఉండగా, ప్రభుత్వ ధర రూ.298గా ఉంది. ఇక, టీఎంటీ ఐరన్ టన్ను రూ.66,000 కాగా, ప్రభుత్వం ధర రూ.56,000, నది ఇసుక 100 ఘనపుటడుగులు రూ.1,400 ఉండగా, ప్రభుత్వ ధర రూ.600, కంకర ఒక ఘనపుటడుగు రూ.800 ఉండగా, ప్రభుత్వ ధర రూ.449, ఇటుకలు 1,000 రూ.10,100 ఉండగా, ప్రభుత్వ ధర రూ.7,889గా ఉంది.

శాంతి భద్రతలపై సీఎస్ సమీక్ష

పెరంబూర్, జూలై 18: రాష్ట్రంలో నెలకొన్న శాంతి భద్రతలపై ఉన్నతాధికారులు, డీజీపీ తదితరులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ నగరంలో ఇటీవల దారుణహత్యకు గురయ్యాడు. మదురైలో వాకింగ్‌కు వెళ్లిన నామ్ తమిళర్ పార్టీ నిర్వాహకుడిని కొందరు హత్య చేశారు. దీంతో, రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాలంటూ ప్రతిపక్షాలు ఆరోపణలు చేపట్టడంతో పాటు ఆందోళనలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో, శాంతి భద్రతలపై సీఎస్ నిర్వహించిన సమావేశంలో హోం శాఖ కార్యదర్శి ధీరజ్‌కుమార్, డీజీపీ శంకర్ జివాల్, గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై 18: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

నెర్కుండ్రం: రమణీయం అపార్ట్‌మెంట్స్, బోన్‌మిల్ ఎల్ఎస్ ఆసుపత్రి, పెరుమాళ్ ఆలయ వీధి, ఏవీకే వీధి, మీనాక్షి నగర్, అళగమ్మాల్ నగర్, పాల్వాడి వీధి, నేతాజీ అవెన్యూ, శక్తి నగర్, తిరువళ్లువర్ నగర్, కరుణాకర్ నగర్, పూందమల్లి హైరోడ్డు.

అడయార్: బీసెంట్ నగర్, మాలవ్య అవెన్యూ, శాస్త్రి నగర్ 1 నుంచి 4 వీధులు, శివగామిపురం, గంగైఅమ్మన్ ఆలయ వీధి, ఎల్‌బిసీ కాలనీ, సుబ్రమణ్యం కాలనీ 1 నుంచి 3 వీధులు, ఎంజీ రోడ్డు, ఆర్కే నగర్ మెయిన్ రోడ్డు, 1 నుంచి 3 క్రాస్ వీధులు, ఆర్కే నగర్, మరుందీశ్వరర్ నగర్, సున్నాంబు కాల్వాయ్, కామరాజర్ నగర్, ఆర్బీఐ కాలనీ 1వ మెయిన్ రోడ్డు, శాస్త్రి నగర్ 1,6 క్రాస్ వీధులు, సంగం కాలని, పాలవాక్కం, డీఆర్ఎస్ నగర్, భారతీదాసన్ వీధి, అంబేడ్కర్ నగర్, అంబేడ్కర్ వీధి, పాఠశాల వీధి, వైద్యర్ వీధి, మాపోసి వీధి, సుబ్బరాయన్ వీధి, మసీదు వీధి, అళగప్పన్ వీధి, నారాయణస్వామి వీధి, భారతియార్ వీధి, ఖాయిదే ఈ మిల్లత్ వీధి, వావూసీ వీధి, సత్యమూర్తి వీధి, పంచాయతి వీధి, వేంబులియమ్మన్ ఆలయ వీధి, పార్క్ వీధి, అమరనంద విల్లా, భాస్ అవెన్యూ, జయశంకర్ నగర్, వైగో రోడ్డు.

తమిళ జాలర్లు భారత పౌరులే...

● హైకోర్టు మదురై బెంచ్

పెరంబూర్, జూలై 18: తమిళ జాలర్లు భారత పౌరులేనని, వారిని రక్షించడంలో కేంద్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపడుతుందనే విశ్వసిస్తున్నామని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ వ్యాఖ్యానించింది. శ్రీలంక జైళ్లలో ఉన్న 26 మంది జాలర్లు, వారి పడవలు విడిపించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలైంది. ఈ కేసు గురువారం విచారణకు రాగా కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాది, జాలర్లను విడిపించి తమిళనాడుకు తీసుకొచ్చేలా తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం న్యాయమూర్తి స్పందిస్తూ... తమిళ జాలర్లు భారత పౌరులేనని, వారి భద్రత ముఖ్యమని, సమస్య మరో దేశంతో ముడిపడి ఉందన్నారు. జాలర్లను రక్షించేందుకు అవసరమైన చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని న్యాయస్థానం నమ్ముతోందని న్యాయమూర్తి తన ఉత్తర్వులో పేర్కొన్నారు.

పోలీసు అధికారులకు షూటింగ్‌లో శిక్షణ

పెరంబూర్, జూలై 18: రాష్ట్ర వ్యాప్తంగా ఇన్‌స్పెక్టర్ నుంచి డీఎస్పీ వరకు పోలీసు అధికారులు పిస్టల్ షూటింగ్ శిక్షణ ఇస్తున్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ ఈ నెల 5న దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లా అండ్ ఆర్డర్ డీజీపీగా డేవిడ్‌సన్ దేవాశీర్వాదం బాధ్యతలు చేపట్టిన వెంటనే జారీ చేసిన సర్క్యులర్‌లో...రాష్ట్రంలోని ఎస్ఐల నుంచి డీఎస్పీ వరకు పిస్టల్ తప్పకుండా దగ్గర ఉంచుకోవాలన్నారు. అలాగే, లాఠీ, పిస్టల్ ఏ సమయంలో ఎలా వినియోగించాలి అనే విషయాలపై శిక్షణ ఇస్తామని, రాజకీయ నేపథ్యంలో వచ్చిన ఫిర్యాదులపై కేసు నమోదుచేసి అరెస్ట్ చేసే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, డీజీపీ ఉత్తర్వులతో రాష్ట్రవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఎస్ఐ నుంచి డీఎస్పీ వరకు పిస్టల్ షూటింగ్ శిక్షణ ప్రారంభమైంది.



కోవైలో పిస్టల్ షూటింగ్ శిక్షణలో పాల్గొన్న అధికారులు

వైభవంగా పాండురంగన్ ఆలయ వార్షికోత్సవం

వేలూరు, జూలై 18: స్థానిక కలాస్ పాళ్యం కలాస్‌వల యార్‌కార వీధిలో ఉన్న రుక్మిణి సమేత పాండురంగ స్వామి ఆలయ 104వ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగిది. పాండురంగ భజన బృందం ఆధ్వర్యంలో మేళతాళాలతో పాలారు తీర్థం ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ఉత్సవమూర్తులకు తిరుమంజనం, భజన కమిటీ వారిచే స్వామి పుష్ప విమానంలో మాడవీధుల్లో విహరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వేడుకల్లో ట్రస్టీ శ్రీనివాస శెట్టి, రుక్మిణి సమేత పాండురంగనాథ భజన మండలి, కలాస్‌పాళ్యం కోట్టైవాసులు, భక్తులు పాల్గొన్నారు.



పుణ్యజలాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

వండలూరు జూకు వాల్పారై పులి

ఐసిఎఫ్, జూలై 18: స్థానిక వండలూరు జూకు వాల్పారై పులిని తరలించనున్నారు. కోయంబత్తూర్ జిల్లా వాల్పారై సమీపంలోని ముడీస్ ప్రాంతం లో ముళ్ల పంది వేటాడడంతో గాయపడిన ఏడాది వయసున్న పులి పిల్లను 2021 సెప్టెంబరు 22న అటవీ శాఖ సిబ్బంది రక్షించారు. అనంతరం జాతీయ పులుల కమిషన్ సలహా మేరకు వాల్పారైలో ఉన్న మందిరిమట్టం ప్రాంతంలో మూడేళ్ల ఆ పులి పిల్లకు వేటాడడంపై శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం మూడున్నరేళ్ల పులి బరువు పెరిగి ఆరోగ్యంగా ఉంది. దీంతో, అన్నా జువాలజికల్ పార్క్‌కు తరలించాలని అధికారులు నిర్ణయించారు. ఈ విషయమై ఆనమలై పులుల అభయారణ్య డైరెక్టర్ రామసుబ్రమణియన్ మాట్లాడుతూ... వాల్పారైలో సంరక్షిస్తున్న పులిని త్వరలో వండలూరుకు తరలించనున్నామని, అంతకుముందు వైద్యపరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు.

వారాంతపు సెలవులకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, జూలై 18: వారంతపు సెలవులు, పౌర్ణమి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 1,245 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎస్ఈటీసీ) తెలిపింది. ఆ ప్రకారం కిలంబాక్కం నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోవై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు శుక్రవారం 260 బస్సులు, 20వ తేది 585 బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు నుంచి నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగుళూరు తదితర ప్రాంతాలకు శుక్రవారం 45 బస్సులు, 20వ తేది 45 బస్సులు నడపనున్నారు. కోయంబేడు నుంచి తిరువణ్ణామలైకు శుక్రవారం 15, పౌర్ణమి సందర్భంగా శనివారం 15 బస్సులు నడుపనున్నారు. అలాగే, బెంగుళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోవై నుంచి ఇతర ప్రాంతాలకు 200 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఇక, సెలవులు ముగించుకున్న తిరుగు ప్రయాణమయ్యే వారి కోసం వివిధ ప్రాంతాల నుంచి అదనపు బస్సులు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థులకు సమాజ సేవకుడి చేయూత

వేలూరు, జూలై 18: ఆర్కాడు తాలూకా చిన్నకుకుండి గ్రామానికి చెందిన పార్తీపన్, విఘ్నేష్ అనే సోదరులున్నారు. వీరి తల్లిదండ్రులు క్యాన్సర్‌తో మృతిచెందారు. వీరికి ఆదరణగా ఉన్న అవ్వ మూడు నెలల క్రితం మృతిచెందింది. పార్తీపన్ అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్లస్ టూ, తమ్ముడు విఘ్నేష్ 10వ తరగతి చదువుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, వారి పరిస్థితి తెలుసుకున్న రంగాపురానికి చెందిన సమాజ సేవకుడు, ఐటీ ఉద్యోగి దినేష్ శరవణన్, వారిద్దరికి విద్యాసామగ్రి, ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా దినేష్ శరవణన్ మాట్లాడుతూ... ఎలాంటి ఆసరా లేని పార్తీపన్, విఘ్నేష్ సెలవు రోజుల్లో కూలీపనులకు వెళ్లి డబ్బు సంపాదిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు మరణించిన పిల్లలకు నెలకు రూ.4,000 పొందేందుకు వీలు పలుమార్లు అధికారులకు వినతిపత్రం సమర్పించినా ఫలితం లేకపోయిందని, వీరిద్దర్నీ ఆదుకొనేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని దినేష్ శరవణన్ విజ్ఞప్తి చేశారు.



విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న దినేష్ శరవణన్

ఒకరోజు అమ్మవారి ఆలయాల పర్యటన

ఐసిఎఫ్, జూలై 18: తమిళనాడు పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆడి మాసం అమ్మవారి ఆలయాల ఒకరోజు పర్యటన పథకాన్ని పరిచయం చేశారు. ఈ పథకం ఉత్తర, దక్షిణ చెన్నై అని రెండుగా విభజించారు. వాలాజా రోడ్డులో ఉన్న పర్యాటక శాఖ కార్యాలయం నుంచి ఉదయం 8.30 గంటలకు బయల్దేరి రాత్రి 7.45 గంటలకు తిరిగి చేరేలా పర్యటన ఏర్పాటుచేశారు. దక్షిణ చెన్నై పథకంలో మైలాపూర్ కర్పగాంబాళ్, ముండగకన్ని అమ్మన్, కోలవిళిఅమ్మన్, టి.నగర్ ఆలయమ్మన్, ముత్తాత్తమ్మన్, సైదాపేట బిడారి ఇలంగాళి అమ్మన్, బీసెంట్ నగర్ అష్టలక్ష్మి, మాంగాడు కామాక్షి అమ్మన్, తిరువేర్కాడు కరుమారి అమ్మన్, కీల్పాక్కం పాతాళ పొన్నియమ్మన్ ఆలయాలు దర్శించుకోవచ్చు. ఉత్తర చెన్నై పథకంలో ప్యారీస్ కాళికాంబాల్, రాయపురం అంకాళపరమేశ్వరి, తిరువొత్తియూర్ వడివుడయమ్మన్, పెరియపాళయం భవానీ అమ్మన్, పుట్లూరు అంకాళ పరమేశ్వరి అమ్మన్, తిరుముల్లైవాయల్ తిరువుడయమ్మన్, పచ్చయమ్మన్, కొళత్తూర్ సెయ్యాత్తమ్మన్, విల్లివాక్కం పరళియమ్మన్ ఆలయాలు దర్శించుకోవచ్చు. దక్షిణ చెన్నై పర్యటనకు రూ.800, ఉత్తర చెన్నై పర్యటనకు రూ.1,000 రుసుము నిర్ణయించారు. వివరాలకు 044-25333333, 25333857 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

హిజ్రాను లైంగికంగా వేధించిన జైలు వార్డెన్

పెరంబూర్, జూలై 18: జైల్లో హిజ్రాపై వార్డెన్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. తిరుచ్చి కేంద్ర కారాగారంలో సుమారు 1,600 మంది ఖైదీలున్నారు. వీరిలో తిరుచ్చికి చెందిన 32 ఏళ్ల హిజ్రా చోరీ కేసులో అరెస్టయి తిరుచ్చి జైలులోని సిబీ-1లోని ప్రత్యేక గదిలో ఉంది. ఈ నేపథ్యంలో, నాలుగు రోజుల క్రితం చెన్నై నుంచి మారీశ్వరన్ అనే జైలు వార్డెన్ బదిలీపై తిరుచ్చి జైలుకు వచ్చారు. ఆయన ప్రత్యేక గదిలో ఉంటున్న హిజ్రాను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై హిజ్రా జైలు సూపరిండెంట్ ఆండాళ్, జైళ్ల శాఖ డీఐజీ జయభారతి తదితరులకు ఫిర్యాదు చేశారు. అయినా, జైలు వార్డెన్ మారీశ్వరన్‌పై ఎలాంటి చర్యలు చేపట్టలేదని సమాచారం. ఈ నేపథ్యంలో, కేసు విచారణ కోసం తిరుచ్చి జిల్లా కోర్టుకు హాజరైన హిజ్రా, కోర్టు ప్రాంగణంలోని ఉచిత న్యాయసలహా కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై న్యాయవాది సుబ్బురామన్ నేతృత్వంలో విచారణ బృందం ఏర్పాటైంది. ఈ బృందం తిరుచ్చి జైలులో విచారణ చేపట్టడంతో పాటు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలు పరిశీలించగా, హిజ్రా ఫిర్యాదు వాస్తవమని తేలింది. దీంతో, తిరుచ్చి జైళ్ల శాఖ డీఐజీ జయభారతి, తిరుచ్చి జైలు సూపరింటెండ్ ఆండాళ్, జైలు వార్డెన్ మారీశ్వరన్‌లను వీఆర్‌కు పంపతూ జైళ్ల శాఖ డీజీపీ మహేష్ వర్ధయాన్ ఈ నెల 11న ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో, డీఐజీ జయభారతి వేలూరు జైలు వార్డెన్ల శిక్షణా పాఠశాల డీఐజీగా, సూపరింటెండెంట్ ఆండాళ్ తిరుచ్చి జైలు వార్డన్ల శిక్షణా పాఠశాల సూపరింటెండెంట్ రెండు రోజుల క్రితం నియమితులయ్యారు.

తరగతి గదిలో పొగాకు ఉత్పత్తులు

● ఏడుగురు విద్యార్థుల సస్పెన్షన్

వేలూరు, జూలై 18: వాణియంబాడి తాలూకా వల్లిపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాల తరగతి గదిలో కొందరు విద్యార్థులు పొగాకు ఉత్పత్తులు తీసుకొచ్చారని ఉపాధ్యాయులకు సమాచారం అందింది. దీంతో, 10,11,12 తరగతులు విద్యార్థుల బ్యాగులను తనిఖీ చేయగా, అందులో నిషేధిత పొగాకు ఉత్పత్తులుండడాన్ని గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఏడుగురు విద్యార్థులను హెచ్ఎం వారం రోజులు సస్పెండ్ చేశారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు నిందితులను అరెస్ట్ చేయాలి

వేలూరు, జూలై 18: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతూ గురువారం పట్టణంలో ఆందోళన చేపట్టారు. ముత్తుకడై బస్టాండ్‌లో అఖిల బౌద్ధ ఇయక్కమ్, వివిధ రాజకీయ పార్టీల నేతృత్వంలో జరిగిన ఆందోళనలో కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆందోళనలో కార్యకర్తలు

తహసీల్దార్ కార్యాలయం జప్తు

పెరంబూర్, జూలై 18: భూసేకరణ చేపట్టి 37 ఏళ్లు గడిచినా పరిహారం చెల్లించని కారణంగా రెవెన్యూ తహసీల్దార్ కార్యాలయాన్ని జప్తు చేశారు. 1987లో సేకరించిన భూములకు సంబంధించి 15 మందికి రూ.45 లక్షలు పరిహారం ఇవ్వని కారణంగా న్యాయస్థానం ఉత్తర్వులతో సిబ్బంది జప్తు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ లావణ్య లిఖిత పూర్వక హామీతో జప్తు చర్యలను తాత్కాలికంగా విరమించుకున్నట్లు కోర్టు వర్గాలు తెలిపాయి.

సవుకు శంకర్‌కు మధ్యంతర బెయిలు

ప్యారీస్, జూలై 18: ప్రముఖ యూట్యూబర్ సవుకు శంకర్‌కు సుప్రీం కోర్టు గురువారం మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించిన కారణంగా సవుకు శంకర్‌ను గూండా చట్టం కింద అరెస్టు చేశారు. శంకర్‌ను గూండా చట్టం కింద అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన తల్లి సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు విచారణకు రాగా సవుకు శంకర్ వల్ల దేశభద్రతకు ఏదైనా భంగం వాటిల్లే అవకాశం ఉందా అని న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో ఈ కేసు మళ్లీ గురువారం విచారణకు రాగా హాజరైన ప్రభుత్వ తరఫు న్యాయవాది సవుకు శంకర్ కిలాంబాక్కం బస్‌స్టేషన్‌కు సంబంధించి పలు అవాస్తవాలను వెల్లడించారని, అందువల్లే ఆయనపై గూండా చట్టాన్ని ప్రయోగించినట్లు వివరించారు. ఇందుకు అభ్యంతరం తెలిపిన సవుకు శంకర్ తల్లి తరఫు న్యాయవాది శంకర్‌ను గూండా చట్టం కింద అరెస్టు చేయడం తగదని, గతంలో హైకోర్టు న్యాయమూర్తి ఇచ్చిన తీర్పును న్యాయస్థానం ముందుంచారు. ఇరుతరఫు వాదనల అనంతరం సవుకు శంకర్‌పై దాఖలైన కేసు విచారణను మద్రాసు హైకోర్టు త్వరితగతిన పూర్తి చేయాలని న్యాయస్థానం ఆదేశించింది.



విద్యుత్ సర్వీస్ ఛార్జీల పెంపు

ప్యారీస్, జూలై 18: ఇటీవల విద్యుత్ ఛార్జీలను పెంచిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విద్యుత్ సర్వీస్ ఛార్జీలను కూడా పెంచుతూ ఉత్తర్వు జారీ చేసింది. ఇప్పటివరకూ సింగిల్ ఫేజ్ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు రూ.1020లున్న సర్వీసు ఛార్జిని రూ.1070కి పెంచారు. ఇదే విధంగా త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్‌కు వసూలు చేస్తున్న సర్వీసు ఛార్జిని రూ.1535ల నుంచిరూ.1610కి పెంచారు.

మూడోసారి ఆడపిల్ల పుట్టిందని పసిబిడ్డను హతమార్చిన కసాయి

ప్యారీస్, జూలై 18: స్థానిక వ్యాసార్పాడిలో మూడోసారి కూడా ఆడబిడ్డ పుట్టిందనే ఆగ్రహంతో కత్తెరతో పసికందును హతమార్చిన తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. వ్యాసార్పాడి సుందరం నాలుగో వీధిలో రాజకుమార్, విజయలక్ష్మి అనే భార్యాభర్తలు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఈ నేపథ్యంలో విజయలక్ష్మికి జూన్ 29న ఆసుపత్రిలో ఆడ శిశువు జన్మించింది. వారం రోజుల తర్వాత తల్లీబిడ్డ డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నారు. ఈనేపథ్యంలో తనకు మూడోసారి కూడా ఆడబిడ్డ పుట్టిందన్న ఆగ్రహంతో రాజ్‌కుమార్ కత్తెరతో పసికందుకు పొడిచాడు. ఆ తర్వాత బిడ్డకు గాయమైందంటూ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అక్కడ మరణించింది. ఆ తర్వాత పసికందుకు చేసిన పోస్టుమార్టంలో పదునైన వస్తువుతో పొడవటం వల్లే బిడ్డకు తీవ్ర గాయమైనట్లు వెల్లడైంది. దీంతో పోలీసులు అనుమానంతో రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తానే కత్తెరతో పొడిచినట్లు అంగీకరించాడు. పోలీసులు హత్యకేసుగా నమోదు చేసుకుని ఆయనను అరెస్టు చేశారు.

తగ్గిన టమోటా ధర

పెరంబూర్, జూలై 18: స్థానిక కోయంబేడు మార్కెట్‌కు దిగుమతులు పెరగడంతో టమోటా ధరలు తగ్గాయి. పొరుగు జిల్లాలు, రాష్ట్రాల్లో కొద్ది రోజులు వర్షాలు కురుస్తుండడంతో ఈ మార్కెట్ టమోటా దిగుమతి తగ్గింది. దీంతో, బుధవారం మార్కెట్లో టమోటా కిలో రూ.85, చిల్లర విక్రయాల్లో రూ.100కు విక్రయమైంది. ఈ నేపథ్యంలో, గురువారం ఉదయం కోయంబేడు మార్కెట్‌లో టమోటా దిగుమతులు పెరగడంతో కిలో రూ.45కు తగ్గగా, చిల్లర విక్రయాల్లో రూ.60 ధర పలుకుతుందని వ్యాపారులు తెలిపారు.



చోళ రాజుల రాజధానిగా, ధాన్యాగారంగా, ప్రాచీన తెలుగు, తమిళ సాహిత్య రాజధానిగా పేరుగడించిన తంజావూరు నగరంలోని రాజగోపాలస్వామి ఆలయం త్రివిధ రూపాల్లో చక్రత్తాళ్వార్లు కలిగిన ఏకైక దివ్యక్షేత్రంగా భాసిల్లుతోంది. పరమేశ్వరుడు మానవ రూపంలో దర్శనమిచ్చే ఏకైక వైష్ణవ క్షేత్రంగానూ ఈ ఆలయానికి పేరుంది. ఈ రాజగోపాలస్వామివారిని నిత్యం ఆరాధించిన రాజొకరు ఆ స్వామివారి పేరుతో రూపొందించిన ఫిరంగి నాలుగు శతాబ్దాలు గడిచినా చెక్కుచెదరకుండా నేటికీ కాంతులీనుతూ ఆ రాజు అపారభక్తిని ఎలుగెత్తి చాటుతోంది. నవగ్రహ దోషాలను తొలగించే ఈ ఆలయంలో చక్రత్తాళ్వార్ ఇష్టదేవేరుల సమేతుడై భక్తులను అనుగ్రహిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, చెన్నై



యోగ నృసింహుడు - కల్యాణ నృసింహుడు

సాధారణంగా ఆలయాల్లో చక్రత్తాళ్వార్ల వెనుకవైపు యోగ నృసింహస్వామి కొలువుదీరి ఉండాలి. అయితే ఇక్కడ చక్రత్తాళ్వార్ వెనుక యోగ నృసింహస్వామి లేరు. బదులుగా రాజగోపురం వెనుక భాగంలో కుడివైపు యోగ నృసింహస్వామి, ఎడమవైపున కల్యాణ నృసింహస్వామి కుడ్య శిల్పాల్లో దర్శనమిస్తుండటం విశేషం. వీరిని దర్శించిన తరువాతే ఆలయంలో చక్రతాళ్వార్‌ను దర్శించాలన్నది ఐతిహ్యం.



చిత్తిరై నక్షత్ర దిన విశేషాలంకరణలో చక్రత్తాళ్వార్

దోషాలను తొలగించే చక్రత్తాళ్వార్లు

- త్రివిధ రూపాల్లో దర్శనం
- రాజగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేకం

ఆధ్యాత్మికం

తంజావూరు ఉత్తర వీధిలోని రాజగోపాలసామి ఆలయం లో చక్రత్తాళ్వార్లు ఇష్టదేవేరులైన విజయవళ్ళి, సుదర్శన వళ్ళి సమేతంగా పూజలందుకుంటున్నారు. ఇలా ఇష్టదేవేరులతో చక్రత్తాళ్వార్ ఏ ఆలయంలోనూ దర్శనమివ్వరు. ఇంతకీ ఈ చక్రత్తాళ్వార్ ఎవరు? మహావిష్ణువు చేతిలో ఉన్న సుదర్శన చక్రమే 'చక్రత్తాళ్వార్'గా పిలుస్తారు.. ఈ చక్రత్తాళ్వార్ కష్టాల కడలిలో భక్తులు అల్లాడుతున్న వేళ మహావిష్ణువు కంటే ముందుగా వేగంగా వెళ్ళి భక్తుల కష్టాలను తీర్చగలిగే శక్తిసామర్థ్యాలు కలిగి ఉన్నారు. ఈ స్వామివారికి సుదర్శనుడు, చక్రరాజన్, నేమి, తికిరి, రథాంగం, సుదర్శనాళ్వాన్, తిరువాళి ఆళ్వాన్ అంటూ పలు నామాలున్నాయి. చక్రత్తాళ్వార్‌ని ఆరాధిస్తే మహావిష్ణువును, పరమేశ్వరుడిని దర్శిస్తే వచ్చేంత పుణ్యం ప్రాప్తిస్తుందని శైవ, వైష్ణవ పండితులు చెబుతారు.



ప్రత్యేక అలంకరణలో చక్రత్తాళ్వార్

ఆలయ వైభవం...

ఆలయంలోకి ప్రవేశించగానే తూర్పు రాజగోపురం గంభీరంగా దర్శనమిస్తుంది. ఆ గోపురం గుండా లోపలకు వెళ్తే రెండు చిన్న గోపురాలు స్వాగతిస్తాయి. వీటిని దాటుకుని వెళితే బలిపీఠం, గరుడాళ్వార్ సన్నిధి ఉన్నాయి. అలంకార మండపాన్ని దాటి వెళ్తే ఆలయ గర్భాలయంలో విజయవళ్లి, సుదర్శనవళ్ళి సమేతుడై చక్రత్తాళ్వార్ సర్వాలంకరణ శోభితంగా దర్శనమిస్తారు. గర్భాలయం వెనుక స్థలవృక్షమైన అత్తి వృక్షం ఉంది. ఇక ఒకే చోట పలు దేవతామూర్తులను దర్శించటం భక్తులను పారవశ్యానికి గురిచేస్తుంది. ఆలయం ఉత్తరదిశ మండపంలో వినాయకుడు,మురుగన్, ఆంజనేయుడు, సప్త కన్యకలు,భైరవుడు, మార్తాండ భైరవుడు వరుసగా దేవతా మూర్తుల విగ్రహాలుంటాయి. ఆ విగ్రహాలకు చేరువగా ఉన్న మండపంలో 'బహుళాముఖి కాళికాంబ' ప్రత్యేక సన్నిధిలో కొలువుదీరి ఉన్నారు. ఆ అమ్మవారి పక్కనే ఎత్తయిన శివదుర్గాదేవి, విష్ణు దుర్గాదేవి, కౌలాలంపూరు మహాలక్ష్మి విగ్రహాలున్నాయి.

1881లో చక్రత్తాళ్వార్ ప్రతిష్ఠ ...

తంజావూరులో మరాఠీల పరిపాలన అంతమయ్యే సమయాన చివరి రాజైన శివాజీ సతీమణి కామాక్షిబాయ్ సాహేబ్ క్రీ.శ. 1881లో ఈ ఆలయంలో విజయవళ్లి - సుదర్శనవళ్లి సమేత చక్రత్తాళ్వార్‌ను ప్రతిష్ఠించారు. వెనుకవైపు ప్రత్యేక మండపాన్ని నిర్మించి అందులో పరమశివుడి మరో అంశమైన శివేంద్రుడిని ప్రతిష్ఠించి కుంభాభిషేకం కూడా జరిపించారు. ఈ వివరాలతో శిలాశాసనం తంజాపురీశ్వరాలయంలో ఉండటం విశేషం. ఆలయంలో శోడష (16) భుజాలతో చక్రత్తాళ్వార్ భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఈ స్వామివారిని దర్శించుకుంటే పూర్వజన్మలో చేసిన పాపాలతో పాటు నవగ్రహదోషాలన్నీ పటాపంచాలవుతాయి. చక్రత్తాళ్వార్‌ను రోజూ 24 సార్లు మండలం పాటు ప్రదక్షిణ చేస్తే సకలసౌభాగ్యాలు కలుగుతాయి. మధుమేహం వంటి దీర్ఘరోగాలు కూడా నయమవుతాయి. చక్రత్తాళ్వార్‌ను ఆరాధిస్తే వివాహ ఆటంకాలు తొలగుతాయని, సంతానభాగ్యం కలుగుతుందని భక్తులు చెబుతుంటారు.

ముచ్చటగా మూడు చక్రత్తాళ్వార్లు...



చక్రత్తాళ్వార్

ఈ ఆలయంలో త్రివిధ రూపాల్లో చక్రత్తాళ్వారు భక్తులకు దర్శనమిస్తారు. ఆలయంలో మూలవిరాట్టుగా, ఉత్సవమూర్తిగా చక్రత్తాళ్వారు కొలువుదీరి ఉన్నారు. వీరిద్దరూ షోడశ భుజాలతో వివిధ రకాల ఆయుధాలు ధరించి ఉన్నారు. వీరే కాకుండా 'అష్టభుజ చక్రత్తాళ్వారు' కూడా ఈ ఆలయంలో ఉన్నారు. ప్రతినెలా చిత్తిరై నక్షత్ర రోజు మాత్రమే ఆయన దర్శనం ఉంటుంది. ఆ రోజున గర్భాలయంలో మూలవర్లు, ఉత్సవ మూర్తితోపాటు ఈ అష్టభుజ చక్రత్తాళ్వార్ కూడా కొలువుదీరి భక్తులను అనుగ్రహిస్తారు. ఇలా త్రివిధ రూపాల చక్రతాళ్వార్లు ఒకే రోజున దర్శనమిచ్చే ఏకైక దివ్యక్షేత్రంగా ఈ రాజగోపాలస్వామి ఆలయం ఖ్యాతి చెందింది. ఈ ఆలయం రుక్మిణి సత్యభామ సమేత కృష్ణస్వామికి చెందినదే అయినా గర్భాలయంలో చక్రత్తాళ్వారే అగ్రపూజలను అందుకుంటున్నారు.



నాలుగు శతాబ్దాల నాటి 'రాజగోపాల ఫిరంగి'

మానవాకారంలో శివుడు...

ఈ ఆలయంలో పరమేశ్వరుడు మానవాకారంలో నిలిచి ఉండి భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ స్వామివారికి ఇరువైపులా పార్వతీదేవి,గంగాదేవి విగ్రహాలు కూడా ఉన్నాయి. ఈ సన్నిధిలో ప్రతినెలా ప్రదోష పూజలు, కార్తీక సోమవారం, మహాశివరాత్రి తదితర పర్వదినాల్లో అన్నాభిషేకం చేస్తారు. ఈ పరమశివుడిలాగే ఆయన తనయుడైన వినాయకుడు కూడా తన ఇష్టదేవేరులతో దర్శనమిస్తున్నారు.

ఫిరంగికి స్వామివారి పేరు...

తంజావూరును పరిపాలించిన రఘునాథ నాయకర్‌కు రాజగోపాలస్వామివారిపై అపారమైన భక్తి ప్రపత్తులుండేవి. ఆ భక్తిని చాటుకులా ఆయన తంజావూరు తూర్పు కోట వద్ద కొత్తగా తయారు చేసిన ఇనుప ఫిరంగికి 'రాజగోపాల ఫిరంగి' అనేనామకరణం చేశారు. ఆ ఫిరంగి 26అడుగుల పొడవు, 20 టన్నుల బరువు ఉంది. భారతదేశంలో అత్యంత ప్రాచీనమైన ఫిరంగిగా చరిత్రలో స్థానం సంపాదించుకుంది. సుమారు 400 సంవత్సరాలు గడిచినా ఈ ఫిరంగి తుప్పుపట్టకుండా ఉండటం చూసి పురావస్తు పరిశోధకులు, శాస్త్రవేత్తలు ఆశ్చర్యపోతున్నారు.

ఎలా వెళ్ళాలి?

రాజధాని నగరం చెన్నై సహా పలు నగరాల నుంచి తంజావూరుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు బస్సులు నడుపుతున్నాయి. చెన్నై నుంచి తంజావూరుకు రైళ్లు కూడా ఉన్నాయి. తంజావూరు రైల్వేస్టేషన్, బస్టాండులో దిగి ఆటోలో వెళ్తే తంజావూరు రాజమహల్‌కు సమీపంలో ఉత్తర వీధిలో ఈ ఆలయాన్ని చేరుకోవచ్చు. తంజావూరు పాత బస్టాండుకు అర కిలో మీటరు, బృహదీశ్వరాలయానికి కిలోమీటర్ దూరంలో ఉన్న ఈ ఆలయంలో ఉదయం 7నుండి 11.40 గంటలు, సా. 4.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు దర్శనానికి అనుమతిస్తారు.





ఆధునిక వైద్య పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి సుబ్రమణ్యం, కాంగ్రెస్ ఎమ్మెల్యే సెల్వ పెరుందగై తదితరులు

ఆరోగ్యసేవలు మరింత విస్తృతం

- మంత్రి ఎం.సుబ్రమణ్యం

ప్యారీస్, జూలై 18: వైద్యసేవల్లో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం కూడా విస్తృతం కావాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. నగరంలోని సవితా వైద్యకళాశాలలో కొత్తగా ఏర్పాటుచేసిన ఫెర్టిలిటీ సెంటర్‌ను మంత్రి బుధవారం ప్రారంభించారు. శ్రీ పెరుంబుదూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగైతో కలసి ఆ కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆధునిక వసతులు, వైద్య పరికరాలను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో సవితా వైద్య విద్యాసంస్థ చాన్సలర్ డా.ఎన్ఎం వీరయ్యన్, ప్రొ చాన్సలర్ డా.దీపక్ నల్లస్వామి, డీన్ డా.కుముద తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో నమ్మకాన్ని పెంచిన సహకార బ్యాంకులు

- మంత్రి పెరియకరుప్పన్



ప్రత్యేక సావనీర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పెరియకరుప్పన్


ప్యారీస్, జూలై 18: సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ప్రజల్లో నమ్మకాన్ని పెంచాయని రాష్ట్ర సహకార శాఖ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్ పేర్కొన్నారు. నాబార్డ్ 43వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం నగరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంకుల ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ కేఆర్ ఆనంద్, రిజిస్ట్రార్ ఎన్.సుబ్బయ్యన్, నాబార్డ్ బ్యాంక్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన పెరియకరుప్పన్ మాట్లాడుతూ 1982లో ప్రారంభించిన నాబార్డ్ బ్యాంక్ 40 సంవత్సరాలకు పైగా విజయవంతంగా ప్రయాణిస్తోందని, 1980లలో గ్రామీణ రుణ వ్యవస్థ లోపాలను పరిష్కరించడంలో కీలకపాత్రను పోషించిందన్నారు.

స్టంట్‌మేన్‌కు హీరో కార్తీ నివాళి



'సర్దార్-2' చిత్రం షూటింగ్‌లో జరిగిన ప్రమాదం కారణంగా మృతి చెందిన స్టంట్‌మేన్ ఏళుమలై వృతదేహానికి హీరో కార్తీ నివాళులర్పించారు. సాలిగ్రామంలో ఉన్న ఏళుమలై నివాసానికి వెళ్ళిన హీరో కార్తీ.. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సర్దార్-2' చిత్రం షూటింగ్ స్థానిక సాలిగ్రామంలో జరుగుతోంది. ఇక్కడ స్టంట్ మాస్టర్ సూపర్ సుబ్బరాయన్ పర్యవేక్షణలో ఫైట్ రిహార్సల్ చేస్తుండగా, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఏళుమలై స్టంట్ రిహార్సల్‌లో పాల్గొన్నారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడిన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతికి చిత్ర యూనిట్ సభ్యులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అలాగే, ఏళుమలై కుటుంబానికి అండగా ఉంటామని నిర్మాత లక్ష్మణ్ కుమార్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఏళుమలై మృతదేహానికి హీరో కార్తీతోపాటు పలువురు చిత్ర బృంద సభ్యులు నివాళులు అర్పించారు.

దీపావళి రేసులో ఎస్కే 'అమరన్'



'అమరన్'లో శివకార్తికేయన్

శివకార్తికేయన్ హీరోగా నటించిన 'అమరన్' చిత్రం దీపావళి సందర్భంగా అక్టోబరు 31వ తేదీ విడుదల చేయనున్నట్టు నిర్మాణ సంస్థ ప్రకటించింది. రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై విశ్వనటుడు కమల్ హాసన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. శివకార్తికేయన్ సరసన సాయి పల్లవి నటించారు. 'రంగూన్' ఫేం రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వం వహించగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చారు. మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలు, రాహుల్ సింగ్, శివ్ అరూర్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్లెస్ : ట్రూ స్టోరీస్ ఆఫ్ మోడరన్ మిలిటరీ' పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇందులో శివకార్తికేయన్ జవానుగా నటించారు. ఈ సినిమా డిజిటల్ రైట్స్‌ను నెట్‌ఫ్లిక్స్ రూ.55 కోట్లకు సొంతం చేసుకున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇప్పటివరకు శివకార్తికేయన్ నటించిన ఒక చిత్రానికి సంబంధించిన డిజిటల్ రైట్స్‌ని ఇంత భారీ ధరకు అమ్ముడుపోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఈ సినిమాను దీపావళి పండుగను పురస్కరించుకుని అక్టోబరు 31వ తేదీన విడుదల చేయనున్నట్టు ఒక పోస్టరు ద్వారా ఆర్‌కేఎఫ్ఐ అధికారికంగా ప్రకటించింది.

సుధా కొంగర ప్రాజెక్టు నుంచి తప్పుకున్న సూర్య?



దర్శకురాలు సుధా కొంగర - హీరో సూర్య కాంబినేషన్‌లో వచ్చిన 'సూరరై పోట్రు' చిత్రం ఘన విజయం సాధించింది. ఈ చిత్రం తర్వాత వీరిద్దరు 'పురనానూరు' అనే ప్రాజెక్టుకు కలిసి పనిచేయనున్నట్టు గతంలో ప్రకటించారు. ఇపుడు ఈ మూవీ నుంచి హీరో సూర్య తప్పుకున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. సూర్య, జ్యోతిక కలిసి తమ సొంత నిర్మాణ సంస్థ 2డి ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మిస్తున్నారు. అయితే, హీరో సూర్య ఇప్పటికే పలు చిత్రాల్లో నటిస్తున్నారు. ఇవన్నీ షూటింగ్ దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో సుధా కొంగర ప్రాజెక్టుకు తన కాల్షీట్స్‌ను సర్దుబాటు చేయలేక పోవడంతో సూర్య, చిత్ర నిర్మాణం నుంచి కూడా 2డీ ఎంటర్‌టైన్మెంట్ తప్పుకున్నట్టు సమాచారం. సూర్య స్థానంలో శివకార్తికేయన్‌తో మరో నిర్మాణ సంస్థ సుధా కొంగర దర్శకత్వంలో ఈ కథను తెరకెక్కించేందుకు ముందుకు వచ్చినట్టు తెలుస్తుంది. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

నాలుగో పెళ్ళికి సిద్ధమవుతున్న వనిత ?



వనిత విజయకుమార్

తమిళ చిత్రపరిశ్రమలో వివాదాస్పద నటిగా గుర్తింపు పొందిన వనిత విజయకుమార్ నాలుగో పెళ్ళికి సిద్ధమవుతున్నట్టు కోలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది. 2000లో నటుడు ఆకాష్‌ను తొలిసారి వివాహం చేసుకున్నారు. వీరికి విజయ్ హరి, జోవిక అనే ఇద్దరు పిల్లలున్నారు. ఆ తర్వాత ఆకాష్ నుంచి విడిపోయి ఆనంద్ అనే వ్యాపారవేత్తను రెండో వివాహం చేసుకున్నారు. వీరికి జయనిత అనే కుమారుడు ఉన్నారు.అయితే, పెద్ద కుమారుడు విజయ్ హరి తండ్రితో ఉండేలా కోర్టు ఆదేశించడంతో తండ్రితో కలిసి ఉంటున్నాడు. రెండో భర్తకు జన్మించిన జయనిత కూడా తండ్రివద్దే ఉండగా, వనిత దగ్గర కుమార్తె జోవికా మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో 2020లో పీటర్ పాల్ అనే వ్యక్తిని మూడో వివాహం చేసుకుంది కానీ, అతడితో మనస్పర్థల కారణంగా దూరమైంది. అప్పటి నుంచి సినిమాలపై దృష్టి కేంద్రీకరించింది. ఈ పరిస్థితుల్లో ఆమె నాలుగోసారి పెళ్ళి చేసుకోబోతున్నట్టు సంకేతాలు ఇచ్చారు. సొంతంగా యూట్యూబ్ చానెల్ నడుపుతున్న ఆమె.. ఓ అభిమాని ప్రశ్నకు సమాధానమిస్తూ, ఊహించని దానికోసం ఎదురు చూడండి అంటూ సమాధానమిచ్చింది. దీంతో ఆమె మరో మారు పెళ్ళిపీటలెక్కనున్నారనే ప్రచారం సాగుతుంది.

చిత్రజ్యోతి



రాధికా ధ్రువ్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

మద్రాస్ రోటరీ క్లబ్ అధ్యక్షురాలిగా రాధికా ధ్రువ్

చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): 'రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్' అధ్యక్షురాలిగా రాధికా ధ్రువ్ నియమితులయ్యారు. ఆమె వచ్చే ఏడాది క్లబ్‌కు నేతృత్వం వహించనున్నారు. అంతేగాక అతిపిన్న వయస్కురాలైన మహిళా అధ్యక్షురాలిగా రికార్డులకెక్కడం విశేషం. అదేవిధంగా క్లబ్ కార్యదర్శిగా డాక్టర్ పి.ధనశేఖర్ నియమితులయ్యారు. కాగా క్లబ్ 33వ అధ్యక్షురాలిగా ఎన్నికైన రాధిక పటిష్ఠమైన సభ్యత్వ నమోదు, సమాజ సేవలను నిబద్ధతతో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమెను క్లబ్ నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు.

నగరంలో 14 వీధుల్లో పార్కింగ్ స్థలాలు

- 'ఎక్స్ ఫోర్స్' పేరుతో ప్రత్యేక విభాగం
- చెన్నై నగర పాలక సంస్థ చర్యలు



అడయార్, జూలై 18: చెన్నై మహానగరంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాతో పాటు వాహనాల సంఖ్య కూడా విపరీతంగా పెరిగిపోతుంది. దీంతో వాహనాల పార్కింగ్ పెను సమస్యగా మారింది. వాహనాల పార్కింగ్ విషయంలో గొడవలు కూడా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చెన్నై మహానగరంలోని 14 వేల వీధుల్లో పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలని నగర పాలక సంస్థ నిర్ణయించింది. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో అనువైన ప్రదేశాలు గుర్తించేందుకు చర్యలు చేపట్టింది. అలాగే, ఈ పార్కింగ్ నిర్వహణ కోసం మాజీ పోలీసులతో 'ఎక్స్ ఫోర్స్' పేరిట ఒక విభాగాన్ని ఏర్పాటు చేసి, పార్కింగ్ నిర్వహణ బాధ్యతలను అప్పగించనుంది. వారి ద్వారా కార్పొరేషన్ కల్పించిన పార్కింగ్ ప్రదేశంలో వాహనాలను పార్కింగ్ చేసే ద్విచక్రవాహనాల నుంచి రూ.5, కార్లకు రూ.20 చొప్పున వసూలు చేయాలని భావిస్తుంది. తద్వారా కార్పొరేషన్ ఖజానాకు ఆదాయం పెంచాలని భావిస్తుంది. వాహనాల పార్కింగ్ స్థలాలను కాంట్రాక్టు విధానంలో ప్రైవేటు సంస్థలు లేదా వ్యక్తులకు కేటాయించడం వల్ల కార్పొరేషన్‌కు రోజుకు రూ.5 లక్షల మేరకు నష్టం వస్తున్నట్టు సమాచారం. ఇపుడు నగర పాలక సంస్థే స్వయంగా మాజీ పోలీసులతో ఎక్స్ ఫోర్స్ పేరుతో ఏర్పాటు చేసే విభాగం ద్వారా పార్కింగ్ రుసుం వసూలు చేయడం ద్వారా కొంతమేరకు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని భావిస్తుంది.





వెజిటెబుల్‌తో బొకేలు చేసిన వారితో న్యాయనిర్ణేతలు - బహుమతులు అందుకున్న విద్యార్థినులు

స్నిగ్ధ పోటీల్లో ఎస్కేపీసీ విద్యార్థినుల ప్రతిభ

ప్యారీస్,జూలై 18: స్థానిక జార్జిటౌన్ కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్కేపీసీ)లో స్నిగ్ధ పేరిట రెండు రోజుల కార్యక్రమం గురువారం ఉదయం ప్రారంభమైంది. సాయంత్రం వరకు ఆఫ్ స్టేజీ ఈవెంట్లుగా వెజిటబుల్స్‌తో బొకేల తయారీ, పొగరహిత వంటల తయారీ, మెహందీ, మేకప్ వంటి పోటీలు నిర్వహించగా, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు.కళాశాలకు చెందిన కళాలయ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విద్యార్థుల్లోని ప్రతిభకు గుర్తింపు కలిగేలా ఆన్ స్టేజ్, ఆఫ్ స్టేజ్ ఈవెంట్లను రెండు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టింది. తొలిరోజు న్యాయనిర్ణేతలుగా దివ్య, జయశ్రీ, రేవతి, ఖుష్బూ పాల్గొన్నారు. విజేతలకు బహుమతుల పంపిణీ చేసిన సందర్భంగా ప్రిన్సిపాల్ డా.టి.మోహనశ్రీ మాట్లాడుతూ... ప్రతి ఏడాది ఆనవాయితీగా తమ కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థినులను ప్రోత్సహించేలా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'సోపేరా' కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ

చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదం, సంగీతం వైవిధ్య శక్తులను ఒకచోట చేర్చి, దేశంలోని ప్రముఖ ఆయుర్వేద వ్యక్తిగత సంరక్షణ బ్రాండ్ అయిన మెడిమిక్స్ బ్రాండ్ 55 సంవత్సరాల ప్రయాణాన్ని వివరించే ప్రత్యేక కాఫీ టేబుల్ బుక్ 'సోపేరా'ను ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా ఆవిష్కరించారు. ఇటీవల నగరంలో జరిగిన ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన ఏవీఏ చోళైల్ హెల్త్‌కేర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏవీ అనూప్ మాట్లాడుతూ..ఆయుర్వేదం శక్తిని అందరికీ పంచాలనే డాక్టర్ వీపీ సిద్ధన్ అన్వేషణ స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని ఈ పుస్తకంలో పొందుపరిచామని వివరించారు. ఆయన ప్రారంభించిన ప్రయాణ దృక్పథం, ఉద్దేశాన్ని చిత్రీకరించే ఆవిష్కరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.



పుస్తకావిష్కరణలో ఇళయరాజా